క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి కొత్తపల్లి విద్యార్థి ఎంపిక


విద్యార్థి వివేకానంద

కొత్తపల్లి: కడప జిల్లా ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపిక య్యాడని గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని ఎం.లింగాపురం గ్రామానికి చెందిన మీనిగ వివేకానంద అనే విద్యార్థి 2022-23 విద్యాసంవత్సరంలో కొత్తపల్లి జెడ్పీహెచ్ పాఠశాలో పదో తరగతి చదవాడని చెప్పారు. పది పరీక్షల్లో 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నలిచాడని వివరించారు. పదిలో ఉత్తమ ప్రతిభ కనపరచడంతో మార్కుల ఆధారంగా ట్రీపుల్ ఐటీ విద్యకు ఎంపికై యినట్లు తెలిపారు. ట్రీపుల్‌ఐటీకి ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు వివేకానందను అభినందించారు.

నేడు డిగ్రీ కళాశాలల బంద్

వెలుగోడు: డిగ్రీ కోర్సులకు ప్రభుత్వం ఖరారు చేసిన నూతన ఫీజులపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. ఫీజులపై విడుదలైన జీవో 22 కు వ్యతిరేకంగా నిరసనలు చేయాలని ఆ సంఘం నిర్ణయించింది. రాయలసీమ యూనివర్సిటీ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం అసోసియేషన్ నాయకులు శౌరిలు రెడ్డి, వెంకటరెడ్డి, వేణుగోపాల్ ఆచారి, మహేశ్వర రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాగేశ్వరరావు, వెంకట మాధవ, హుసేనయ్య, రమణారెడ్డి, సుధాకర్ రెడ్డి, ఆర్సీ రెడ్డిల నేతత్వంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కాలేజీలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని వారు పిలుపునిచ్చారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం


మామిడి మొక్కలను పరిశీలిస్తున్న పీడీ

మహానంది: ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు నంద్యాల జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.రామచంద్రారెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లెలో గురువారం కెనాల్ బండ్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ పండ్ల తోటలు, మునగ మొక్కలను పెంచేందుకు ఆసక్తి ఉన్న రైతులు అడిగితే వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వసుధ, ఈసీ వరదరాజులు, టీఏ రోజారాణి పాల్గొన్నారు.

నిధుల మంజూరు

జూపాడుబంగ్లా: మండలానికి 2022-23 ఏడాదికిగాను 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ సుబ్రమణ్య శర్మ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టైడ్ ఫండ్స్ రూ.10,18,829 మంజూరు కాగా వాటిని తాగు నీరు, పారిశుద్ధ్య పనులకు వినియోగించాలన్నారు. అలాగే అన్‌టైడ్ ఫండ్స్ రూ.6,79,196 విడుదల అయ్యాయన్నారు. వీటిని రోడ్లనిర్మాణం నిమిత్తం వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఒకే ఈతలో రెండు లేగదూడలు



కొత్తపల్లి: ఏ ప్రాణిలోనైన ఒక ఈతలో ఒక బిడ్డకు మాత్రమే జన్మనివ్వడం సర్వసాధారణం. రెండు లేక మూడు బిడ్డలకు జన్మనివ్వడం అరుదు. మండల పరిధిలోని పెద్దగుమ్మడాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మజరా గ్రామమైన సింగరాజుపల్లె గ్రామంలో చిన్నరాయుడు(బక్కన్న) అనే రైతు రెండు ఆవులను పెంచుకుంటున్నాడు. అందులో ఓ ఆవు గురువారం ఒకే ఈతలో రెండు లేగదూడలను ప్రసవించింది. మండలంలో ఈ ఘటన మొట్ట మొదటి సారికావడంతో గ్రామంలోని ప్రజలు ఈ అరుదైన దృశ్యాన్ని చూసేందుకు వస్తున్నారు.

హైస్కూల్‌కు డిప్యుటేషన్‌పై నలుగురు టీచర్లు

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచర్ల కొరత ఉండడంతో నలుగురు టీచర్లను డిప్యుటేషన్ పద్ధతిపైన నియమిస్తూ నంద్యాల జిల్లా విద్యాధికారి కె.సుధాకర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వర్క్ అసిస్మెంట్ కింద శ్రీశైలం మండలంలో పనిచేస్తున్న పి.రవికుమార్‌ను తెలుగు టీచర్‌గా, బి.వెంకటేశ్వరమ్మను బయాలాజికల్ సైన్స్ టీచర్‌గా, ఎన్ .రమేష్‌ను ఫిజికల్ సైన్స్, ఎ.శ్రీలక్ష్మీని ఉర్దూ టీచర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

- ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- కొట్టాల చెర్వులో 400 కుటుంబాలకు సర్టిఫికెట్లు పంపిణీ


రేగడగూడూరులో వృద్ధురాలికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నాయకులు

ఆత్మకూరు: సత్వర సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. పట్టణంలోని అర్బన్‌కాలనీ, కొట్టాలచెర్వు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతుందని, ఇందులో భాగంగా సచివాలయాల ద్వారా నేరుగా ప్రజా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. కొట్టాలచెర్వు చెంచుగూడెంలో 400 కుటుంబాలకు 900 సర్టిఫికెట్లను అందించడం సంతోషంగా ఉందన్నారు. కొట్టాలచెర్వు చెంచులతో పాటు నియోజకవర్గంలోని చెంచుగూడాల్లో విద్యుత్, బియ్యం కార్డులు, విద్యుత్, పొలాల సమస్యలు పరిష్కరించి ప్రతి పథకం అందేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, ఎంపీటీసీలు కోట్ల రాజ్యలక్ష్మి, కోట్ల నాగేశ్వరరెడ్డి, దేవన్న, శివరామయ్య, సురేష్, కొట్టాల చెరువు సర్పంచ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే జగనన్నకు చెబుదాం

వెలుగోడు: ఇంకా పరిష్కారం కాని సమస్యలు ఏవైనా ఉంటే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. రేగడగూడురు గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్నసురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో 667 మంది నుంచి వినతులు స్వీకరించగా 659 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మిగతా 8 కూడా వీలైనంత తొందరగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో శిల్పా భువనేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి , జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, నంది రెడ్డి గారి రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ రజియాబి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాపీ మాస్టర్‌ను నమ్మొద్దు

మహానంది: పేర్లు మార్చి కొన్ని, కర్ణాటక రాష్ట్రం నుంచి మరికొన్ని పథకాలను కాపీ కొడుతున్న మైండ్‌గేమ్ మాస్టర్ చంద్రబాబును నమ్మితే అధోగతి పాలవుతారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒక్కపైసా అవినీతి లేకుండా వలంటీర్లు నిస్వార్థ సేవలందిస్తున్నారన్నారు. అందరి మన్ననలు పొందుతుంటే పవన్‌కల్యాణ్ మాత్రం పిచ్చిపట్టినోడిలా మాట్లాడుతున్నాడన్నారు. ప్రపంచ దేశాలన్నీ ఏపీ పాలన వైపు చూస్తున్నాయని, సచివాలయవ్యవస్థ ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామంలో 1253 మంది దరఖాస్తులు చేసుకోగా అందరికీ అర్హతను బట్టి ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, ఏపీజీబీసీ డైరెక్టర్ నాగభూపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు పెద్ది స్వరూప, సొసైటీ చైర్మన్ పగడాల నాగరాజు, ఒంటిద్దు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే శిల్పా ఆగ్రహం

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఏర్పాట్లు సరిగా చేయకపోవడంపై ఎమ్మెల్యే శిల్పా ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు, ప్రజలు, ఆరోగ్యసిబ్బందికి కుర్చీలు వేసి నీడ కల్పించకపోతే ఎండలో ఎలా కూర్చుంటారన్నారు. గ్రామంలో 587 మందికి ధ్రువ పత్రాలు పంపిణీ చేశామని ఎంపీడీఓ వాసుదేవ గుప్త తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి సంజీవరెడ్డి, సర్పంచులు మేరీ పుష్పాంజలి, పల్లె నాగమణి, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చింతల రామయ్య, డైరెక్టర్ విక్రమసింహనాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- బానకచెర్లలో జగనన్న సురక్ష


బానకచెర్లలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పాములపాడు:రాజకీయ పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ప్రభుత్వ పథకాలు అందించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల ద్వారా కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే పథకాలు వర్తించేవని అన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందుతున్నాయన్నదే కళ్లెదుటే కనపడుతోందని వివరించారు. గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామంలో ప్రతి ఒక్కరికి పథకాలు అందుతున్నాయన్నారు. అనంతరం 70 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన శంకరయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి భార్య శారదమ్మకు వైఎస్‌ఆర్ బీమా సాయం కింద రూ.10,000 అందజేశారు. అనంతరం సచివాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ, వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచు నరసింహగౌడు, జేఎస్‌సీ కన్వీనర్ రమణారెడ్డి, నాయకులు చౌడయ్య, బాలీశ్వరరెడ్డి, మధుసూదన్‌రావు, భీమశేఖర్, ఓబన్నగౌడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పథకాలివ్వడమే ధ్యేయం

జూపాడుబంగ్లా: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలివ్వటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. గురువారం మండలకేంద్రమైన జూపాడుబంగ్లా సచివాలయం-1 వద్ద సర్పంచ్ మొట్టె బాలయ్య అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దరఖాస్తుదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

అధికారులపై ఆగ్రహం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నసురక్ష కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమంలో పాల్గొనడానికి అధికారులకు ఇబ్బందులుంటే తెలపాలన్నారు. కార్యక్రమానికి గైర్హాజరైన హౌసింగ్, ట్రాన్స్‌కో, అధికారులతో పాటు మరికొంత మంది అధికారుల తీరును కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మరోపర్యాయం ఏదేని కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు గైర్హాజరైతే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మోతెవెంటకమ్మ, సంటిగారి కృపాకర్, జంగాలపెద్దన్న, తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, నాయకులు శివానందరెడ్డి, దేవసహాయం, ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అందరికీ రక్ష 'జగనన్న సురక్ష'

మహానంది: పథకాలు అందలేదని నిరాశ చెందేవారికి జగనన్న సురక్ష రక్షగా నిలుస్తుందని గోపవరం సొసైటీ చైర్మన్ వి.రామకృష్ణుడు(గాజులపల్లె కిట్టు) తెలిపారు. గాజులపల్లెలో గురువారం జగనన్నసురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. జేసీఎస్ ఇన్‌చార్జ్, జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మరో బృందం పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు. ఈ నెల 18న గాజులపల్లెలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

రేపు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

మహానందిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. అలాగే బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులో కార్యక్రమం నిర్వహిస్తామని జేసీఎస్ మండల కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి చెప్పారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

జూపాడుబంగ్లా: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించి వారు క్రీడల్లో రాణించేలా తీర్చిద్దేందుకు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తెలిపారు. గురువారం జూపాడుబంగ్లాలోని రమేష్‌రెడ్డి ఇంటివద్ద వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకుగాను నందికొట్కూరు, పగిడ్యాలలో రూ.2.38కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియాలను ఈనెల 15న పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌రెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, కోసిక తరుణ్ కుమార్‌రెడ్డి, చెన్నారెడ్డి, దొడ్డా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

మిడుతూరు: మండలపరిధిలోని కడుమూరు గ్రామానికి చెందిన గొల్ల మంగమ్మ ఉపాధి పనులకు వెళ్లి పాముకాటుకు గురై చికిత్సపొందుతూ హాస్పిటల్‌లో ఇటీవల మృతిచెందింది. మృతురాలి భార్త నామినీ గొల్ల మద్దిలేటికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ. 10 వేలను ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు, ఏపీఓ జయంతి గురువారం అందజేశారు. అదేవిధంగా కొద్ది రోజుల క్రితం చనిపోయిన తెలుగు శివశంకర్ భార్య నామినీ అయిన తెలుగు శారదకు రూ.90 వేలు బీమా పరిహారం మంజూరైన ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జీవరత్నం, వెల్ఫేర్ అసిస్టెంట్ రహిమాన్, వలంటీర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో పింజరి బాషా గుండెనొప్పితో గురువారం మృతి చెందాడన్నారు. ఆ కుటుంబానికి వైఎస్‌ఆర్ బీమా పథకం కింద రూ.10,000 తక్షణ సాయాన్ని గ్రామ సర్పంచు వరప్రసాద్ అందజేశారు. నాయకులు వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్లో చేరేందుకు అవకాశం కల్పించండి

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో బీసీ, ఓసీ విద్యార్థినులకు అవకాశం కల్పించాలని తల్లిదండ్రులు ఎమ్మెల్యేను ఆశ్రయించారు. బీసీ, ఓసీ విద్యార్థినులకు ప్రత్యేకంగా జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల పరిధిలో హాస్టల్ వసతిలేదు. దీంతో ఆయా మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులు హాస్టల్‌లో ఉండి విద్యను అభ్యసించే అవకాశం కోల్పోయారని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే ఏఎస్‌డబ్ల్యూఓ వెంకటసుబ్బారెడ్డిని పిలిపించి చదువుకోవాలనే ఆసక్తి ఉన్న బీసీ, ఓసీ విద్యార్థినులకు కూడా అవకాశం కల్పించాలని ఆదేశించారు.

ధోబీఘాట్లు నిర్మించాలి

జూపాడుబంగ్లాలో శిథిలమైన దోబీఘాట్ల స్థానంలో నూతన ఘాట్లు నిర్మించి ఆదుకోవాలని గ్రామానికి చెందిన రజకులు ఎమ్మెల్యే ఆర్థర్‌ను కోరారు. త్వరలో నూతన ధోబీ ఘాట్లు, బోరు, ఇళ్లస్థలాలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బస్తిపాటి మౌలాలి, రామాంజనేయులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

మిడుతూరు: స్థానిక తొగట వీధిలోని ఓ ఇంట్లో గురువారం రాత్రి సరళ అనే మహిళ కరెంట్ వాటర్ హీటర్‌తో నీటిని వేడిచేసుకొని స్విచ్ ఆఫ్ చేయడం మరిచి స్నానానికి వెళ్లడంతో మంటలు రేగి ఇంట్లో ఉన్న ధాన్యం , కుట్టుమిషన్ కాలిపోయాయి. గమనించిన కుటుంబసభ్యులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. ఇరుగు పొరుగు వారు నీటితో మంటలను ఆర్పివేశారు. కాగా కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చిట్టి చేతులతో భారమైన పనులు


సారువా ఎక్కి గోడలకు నీళ్లుపోస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: బడిలో పాఠాలు నేర్వాల్సిన బడి ఈడు పిల్లలతో ఉపాధ్యాయులు బరువైన పనులు చేయించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని జడ్డువారి పల్లె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు - నేడు పనుల్లో భాగంగా అదనపు గది మరమ్మతు పనులు జరుగుతున్నాయి. అయితే గురువారం గోడలకు కట్టిన సారువా (కట్టెలు) పై ఎక్కి పాఠశాల విద్యార్థులు ఒకరి సహాయంతో ఒకరు నీళ్ల పోస్తున్న ఘటన చూసి తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు. కట్టెలపై నుంచి బ్యాలెన్స్ తప్పితే కిందపడి గాయాలపాలయ్యే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంఈఓ శ్రీరాములను వివరణ కోరగా సంబంధిత ఉపాధ్యాయులను ఫోన్ చేసి మందలించామని, వివరణ కూడా కోరామని చెప్పారు. విద్యార్థులతో పనిచేయించడం తప్పని, వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సొంత డబ్బు వెచ్చించి సేవా కార్యక్రమాలు


కరోనా సమయంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు లచ్చమ్మకు కూరగాయలు అందజేస్తున్న వలంటీరు శ్రీకాంత్

మండలకేంద్రమైన జూపాడు బంగ్లా గ్రామసచివాలయం-2 పరిధిలో వలంటీరుగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ తన చుట్టుపక్కల వారికి సేవలు చేయాలనే సంకల్పంతో మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ జూపాడుబంగ్లా సచివాలయం-2 పరిధిలో వలంటీరు చేరి తన పనితీరుతో అందరి మన్ననలు పొందుతున్నాడు. కరోనా సమయంలో ప్రభుత్వం అతనికి ఇచ్చిన రెండు మాసాల వేతనం రూ.10వేలు వెచ్చించి తన పరిధిలో ఉన్న 71 కుటుంబాలకు కూరగాయలు అందజేసి వారి దీవెనలు పొందాడు. కరోనా వైరస్ వ్యాప్తి గురించి తెలియజేయటంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఎవరికైనా జ్వరాలు, దగ్గు, జలుబు వంటివి వస్తే వెంటనే ఆరోగ్యసిబ్బంది, వైద్యులకు తెలియజేసి వారికి చికిత్సలు అందేలా చేశాడు.

నా మనుమడున్నాడనే ధైర్యం ఉంది



నాకు ఓ కుమార్తె పుట్టగానే నాభర్త చనిపోయాడు. కుమార్తెకు పదేళ్ల క్రితం వివాహం చేశాను. ప్రస్తుతం ఒంటరిగా జీవిస్తున్నాను. ప్రతి నెల ఒకటోవ తేదీ తెల్లవారకముందే నాచేతిలో పింఛన్ డబ్బులు పెడుతున్న శ్రీకాంత్‌ను చూస్తే నామనుమడు నాచేతిలో డబ్బులు పెట్టినంత ఆనందంగా ఉంటుంది. నాకు రైతు భరోసా- పీఎం కిసాన్ వంటి సంక్షేమ పథకాలు అందించాడు. నేనున్నది మట్టిమిద్దె కావటంతో పదిరోజుల క్రితం సీఎం సార్ మిద్దె మంజూరు చేశాడు. నాకు చాలా సంతోషంగా ఉంది. నాకు కొడుకుల్లేకపోయినా నా మనుమడు శ్రీకాంత్ ఉన్నాడని ధైర్యంగా ఉన్నాను. - లచ్చమ్మ, జూపాడుబంగ్లా

అవసరం తెలుసుకొని..


హాస్పిటల్‌లో లబ్ధిదారునికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఉశేన్‌బాషా

మద్దూరుకు చెందిన వలంటీర్ ఉశేన్‌బాషా. జనవరి నెలలో ఎప్పటిలాగే పింఛన్ల పంపిణీకి వెళాడు. లబ్ధిదారుడు పాణ్యం మాబు ఇంటి వద్దకు వెళ్లగా తాళం వేసి ఉండటంతో ఫోన్‌చేశాడు. అయితే అతనికి ఆరోగ్యం పరిస్థితి సరిగా లేకపోవడంతో అప్పటికే కర్నూలులోని హాస్పిటల్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. అతను ఇక్కడకు వచ్చి పింఛన్ తీసుకునే పరిస్థితి లేదు. అప్పుడు వాళ్లకు డబ్బు చాలా అవసరమని తెలిసింది. విషయం సర్పంచు అబ్బురున్నిసా భర్త జబ్బార్‌కు చెప్పాను. నేనూ, అతను కలిసి వెంటనే కర్నూలు హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ అందజేశారు.

కర్నూలు హాస్పిటల్‌లో ఉన్న నాకు పింఛన్ అందించారు



నా పేరు పాణ్యం మాబు. నాది మద్దూరు గ్రామం, నాకు పక్షవాతం వచ్చి కర్నూలులోని హాస్పిటల్‌లో చేరాను. అప్పుడు మేము ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్నాము. అయితే ఆ సమయంలో మా వలంటీర్ ఉశేన్‌బాషా కర్నూలుకు వచ్చి పింఛన్ సొమ్ము అందజేశారు. ఆ టైంలో ఆ డబ్బు నాకు ఎంతగా ఉపయోగపడిందో మాటల్లో చెప్పలేను. నిజంగా చెప్పాలంటే వలంటీర్లు ప్రజల కోసం చేస్తున్న సేవల గురించి ఎంత చెప్పినా తక్కువే. -పాణ్యం మాబు, మద్దూరు

రైతులు మోసపోకూడదనే అగ్రిటెస్టింగ్ ల్యాబ్


అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: ప్రతి రైతు బిడ్డ నష్టపోకుండా ఉండేందుకే ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ లాబ్‌లు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి తెలిపారు. పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతన్నలు పంట సాగు చేసే సమయంలో కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలు మంచివా, నకిలీవా గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు . పంటలు సరిగా రాకపోగా రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆత్మకూరు డివిజన్‌లోని ఏ గ్రామం నుంచైనా ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల నాణ్యత, భూసార పరీక్షలను రైతులు అగ్రిటెస్టింగ్ ల్యాబ్లో ఉచితంగా చేయించుకోవచ్చని చెప్పారు. నియోజకవర్గంలో పంటలను నిల్వ ఉంచుకునేందుకు ఇప్పటికే 6 చోట్ల గోడౌన్లు నిర్మిస్తున్నామని, మరో 22 చోట్ల త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.

పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ప్రారంభం

పట్టణంలోని పశువైద్యశాలలో గురువారం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూగజీవాలు ఏ వ్యాధి వలన ఇబ్బందులు పడుతున్నాయో ఈ పరీక్షా కేంద్రం ద్వారా గుర్తించి సరైన మందులు ఇవ్వడం వలన అవి కోలుకుంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అడ్వైజర్‌బోర్డు చైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఎంపీపీ తిరుపాలమ్మ, ఏడీఏలు ఆంజనేయులు, అరుణ, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి, విజయచౌదరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు


దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం ఈఓ , అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయ స్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

కుమారస్వామికి..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో గురువారం కృత్తికా నక్షత్రం సందర్భంగా అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఏ లబ్ధిదారుడు నష్టపోకూడదనే 'జగనన్న సురక్ష'


గోకవరంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


కోనేటమ్మపల్లిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

కొత్తపల్లి: ఏ సంక్షేమ పథకానికైన, ప్రభుత్వ పథకాలకైన సరైన పత్రాలు లేకుండా ఏ లబ్ధిదారుడు నష్టపోకూడదని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ, సర్పంచు మారెన్నలు అన్నారు. గురువారం మండలంలోని గోకవరం గ్రామ సచివాలయవద్ద ఎంపీడీఓ మేరి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆదాయ ధ్రువపత్రాలు-260, కులధ్రువీకరణ పత్రాలు 266, ఆధార్‌తో మొబైల్ అనుసంధానం-16, రేషన్ కార్డులో చేర్పులు, మార్పులకు చెందిన ధ్రువపత్రాలు-6తో కలిపి మొత్తం 548 సర్టిఫికెట్లను మంజూరు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, పీఓఎల్‌ఆర్ డీటీ పెద్దన్న, వైస్ ఎంపీపీ జయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీష్‌గౌడ్, చెన్నయ్య, జయన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

మిడుతూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని జగనన్న సురక్ష నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురాం అన్నారు. గురువారం మండలపరిధిలోని కడుమూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సర్పంచ్ జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. లబ్ధిదారులకు 1233 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి , తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, జగనన్న సురక్ష మండల ఇన్‌చార్జ్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు మేలు

నందికొట్కూరు రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతగానో మేలు కలుగుతుందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దామోదరరెడ్డితో కలిసి లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీఓ శోభారాణి, డీటీ సత్యనారాయణ, దామగట్ల ఉప సర్పంచ్ ఏసురత్నం, పంచాయతీ కార్యదర్శి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే నవరత్నాలు

పగిడ్యాల: పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాన్ని అమలు చేస్తున్నారని ఎం. గణపురం గ్రామ ఎంపీటీసీ దాసరి ప్రియాంక, సర్పంచ్ ప్రతాపరెడ్డి అన్నారు. గురువారం లక్ష్మాపురం 3 సచివాలయం పరిధిలోని ఎం. గణపురంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో చేపట్టారు. 205 మంది అర్హులకు కుల, ఆదాయ, తదితర ధ్రువ పత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఉప సర్పంచ్ సుభద్రమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి వెంకటేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.